ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 | సంచిక : 04 | డిసెంబర్ 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

మురమళ్ళ .... 09-11-2010

తణుకు ......... 14-11-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-11-2010, మురమళ్ళ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మురమళ్ళ గ్రామం పుణ్యక్షేత్రం. ప్రాచీనకాలం నుండి ఈ క్షేత్రం ఉంది. కాశీ, మురమళ్ళ ఈ రెండు చోట్ల శివుడికి నిత్యకళ్యాణం జరుగుతుంది అని చెపుతారు. ఇక్కడ ఉన్న స్వామి భద్రకాళీసమేత వీరేశ్వరస్వామివారు. ఇది ముని మండలం. పూర్వం ఈ ప్రాంతంలో ఇక్కడ స్వామిసన్నిధిలో మునులు, ఋషులు మందలుగా ఉండేవారు అని చెపుతారు. మీరు ఏదో చదవటంకంటే అనుష్ఠానవేదాంతం ముఖ్యం. మీకు సబ్జక్టు ఎంతవరకు అర్థమవుతోందో అంతవరకు ప్రాక్టీసు చేయటానికి ప్రయత్నం చేయండి. మన స్వరూపంలో ఉన్న సుఖాన్నే ఆత్మసుఖం అంటారు. ఆత్మ అంటే ఎవరో కాదు. ఆత్మ యొక్క వైభవం గురించి కృష్ణుడు చెప్పి చెప్పి చివరలో ఆత్మ అంటే ఎవరో కాదు అది నీవే అని చెప్పాడు. మన కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం, వస్తువులు, వైభవాలు ఇవన్నీ తాత్కాలికంగా మన మనస్సుకు సత్యంలాగ కనిపించినా అవి నూటికి నూరుపాళ్ళు అసత్యమే. ఈశ్వరుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఈ సృష్టికంతా యజమాని ఆయనే. ఆయన సంకల్పం ప్రకారం ఈ సృష్టి అంతా నడుస్తోంది. భక్తులు భగవంతుడితో సమానము. భక్తులుంటేనే భగవంతుడి యొక్క వైభవం తెలుస్తుంది. అందుచేత భక్తులను దైవస్వరూపంగా చూడాలి.

మన శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకొని కష్టపడి సాధన చేస్తేనే కాని లోపలఉన్న వస్తువు మనకు గోచరం కాదు. మీకు తత్త్వం తెలుసా అని అంటారు. దాని అర్థం ఏమిటి అంటే తత్ అంటే అది, త్వం అంటే నీవు, అది నీవే అన్న సంగతి నీకు తెలుసా అని చెప్పటం. దేనినైతే

పొందాలనుకొంటున్నావో, దేని ఆధారంగా ఈ సృష్టి అంతా నడుస్తోందో అది ఎవరో కాదు అది నీవై ఉన్నావు. నీ స్వరూపానికి, నీ హృదయంలో ఉన్న సత్యానికి నువ్వు దూరంగా లేవు కాని దూరంగా ఉన్నామని మనకు అనిపిస్తోంది అందుచేత మనం అశాంతికి, దుఃఖానికి గురి అవుతున్నాము. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. ఎన్ని ఆకర్షణలు ఉన్నా, మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, అనుకూలంగా లేకపోయినా మీ చిత్తాన్ని క్షోభ పెట్టుకోవద్దు అని అష్టావక్ర మహర్షి చెప్పారు. ఈ సృష్టి అంతా ఈశ్వరసంకల్పం ప్రకారం నడుస్తుంది. నిన్న ఉదయం వరకూ ఇక్కడకు రాకూడదు అని మేము అనుకొన్నాము కాని చివరకు ఇక్కడకు వచ్చాము అంటే మా సంకల్పం ఏమైయింది. ఈశ్వరసంకల్పం ముందు మానవసంకల్పం పనికిరాదు. ఈశ్వర సంకల్పం అతి బలీయమైనది, ఆయన సంకల్పమే నెరవేరుతుంది. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అంతా ఈశ్వరసంకల్పం ప్రకారమే జరుగుతుంది. అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తూ ఉంటే ఇంక మనం సాధన చేయటం దేనికి అని అడిగారు. దేహం ప్రారబ్ధాన్ని బట్టి నడుస్తుంది, ఆ దేహంతో తాదాత్మ్యం పొందకుండా ఉండటానికే సాధన. దేహంతో తాదాత్మ్యం పొందుతూ ఉంటే లోకం యొక్క ఆకర్షణలో కొట్టుకొనిపోతావు. నీకు ఆలోచనలు వస్తూ ఉంటాయి, తలంపులు వస్తూ ఉంటాయి, ఉద్రేకాలు వస్తూ ఉంటాయి. ఉద్రేకం వచ్చినప్పడు కారణం లేకుండా ఎదుటి వారిని తిడతాము, తరువాత క్షమార్పణ చెపుతాము. అంటే మనం చేసిన తప్పును అంగీకరిస్తున్నాము అని అర్ధం. క్షమార్పణ చెప్పటం మంచిదే.

లోకంలో అనేక ఆకర్షణలు, వికర్షణలు ఉంటాయి. రెండూ ప్రమాదమే. ఇక్కడ ఇంతమంది ఉన్నారు. కొంతమంది పట్ల నాకు ఇష్టం వస్తోంది అనుకోండి, కొంతమంది పట్ల అయిష్టం వస్తోంది అనుకోండి మీరు నష్టపోరు, నేను నష్టపోతాను. ఈ రకమైన జీవితం గడుపుతూ ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. రాగం ఎంత ప్రమాదమో ద్వేషం కూడా అంతే ప్రమాదం. ప్రపంచంలో రకరకాల మనుషులు ఉంటారు. వారి శరీరాలు తేడాగా ఉన్నా, మనస్సులు తేడాగా ఉన్నా, వారి జీవిత విధానం తేడాగా ఉన్నా అందరిలోను ఉన్న సద్వస్తువు ఒక్కటే. సత్యం అనేది ఒకటిగానే ఉంటుంది. లోపలఉన్న సత్యం మీకు అనుభవంలోనికి వచ్చేవరకు దాని తాలుక శాంతి, సుఖం మీకు తెలియదు. అది మీకు అనుభవంలోనికి రావాలంటే మీరు శీలాన్ని కాపాడుకోవాలి. శీలం లేని తెలివితేటలు, తెలివితేటలు లేని శీలము సమాజానికి ఉపయోగపడవు అని ఒక ఋషి చెప్పాడు. అందుచేత అవి రెండూ నీవు కల్టివేట్ చేసుకోవాలి.

ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఈ రెండూ చాలా కష్టం. వేదాలలో ఇంద్రుడిని

ఎక్కువగా పొగిడారు. ఆ ఇంద్రుడే ఇంద్రియాలను నిగ్రహించుకోలేక అనేకసార్లు బోల్తా కొట్టాడని పురాణాలలో ఉంది. అంటే దానినిబట్టి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎంత కష్టమో మనకు తెలుస్తుంది. నేను చేసిన తపస్సు అంతా మీకు ధారపోసి వెళుతున్నాను అని శిష్యులతో రామకృష్ణుడు చెప్పాడు. ఇక్కడ రామకృష్ణుడు చెప్పేది ఏమిటి అంటే నా శక్తిని మీకు ప్రసాదించటం వలన, నా అనుగ్రహం వలన మీ ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి వస్తాయి, అప్పుడు మీకు తేలికగా సత్యానుభవం కలుగుతుంది. అందుచేత గురుఋణం తీర్చుకోవటం చాలా కష్టం. గురువుని ఉపాసించమని పరమాత్మ గీతలో చెప్పాడు. బ్రహ్మాత్మ బుద్ధిగలవాడు గురువు. దేహంతో తాదాత్మ్యం పొందేవాడు, తన ఉనికిని దేహానికే పరిమితం చేసుకొన్నవాడు గురువు కాదు. మనో దేహములకు అతీతంగా ఉన్నవాడు గురువు. పరిమితులకు, హద్దులకు లోబడిఉన్నవాడు ఎవడూ గురువుకాదు. మనం కష్టపడి పట్టుదలతో సాధన చేయాలి, ఫలితం కోసం ఎదురు చూడకూడదు. ఈశ్వరుడు ఆ జీవుడిని ఎప్పుడు అనుగ్రహిస్తాడో, ఎలా అనుగ్రహిస్తాడో అది ఎవరూ చెప్పలేరు. ఆ ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు.

వారిని వారు పొగుడుకోవటం చాలా మందికి అలవాటు. ఏమనిషిలో అయినా అక్కడ వ్యక్తి కనబడుతున్నాడు అంటే తప్పనిసరిగా వాడిని వాడు పొగుడుకొంటాడు. వాడిని వాడు పొగుడుకోవటం అనేది జ్ఞాని లక్షణం కాదు, అది అజ్ఞానలక్షణం. నేను చాలామంది పెద్దవాళ్లను చూసాను, వారికి స్తోత్రాలు అంటే బాగా ఇష్టం. ఆత్మస్తుతి, పరనింద సర్వసాధారణం. ప్రతీ మనిషిలో ఈ బలహీనతలు కనిపిస్తూ ఉంటాయి. మీరు విష్ణుసహస్రనామాలు, లలితా సహస్రనామాలు చదువుతున్నారు. దైనందిన జీవితంలో మీ బిహేవియర్ ఎలా ఉంది, మీకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉందా అని ఇవి ఏమీ చూడకుండా మీ పొగడ్తలు చూసి ఏ దేవుడు మీకు ఆత్మజ్ఞానం ఇవ్వడు. అయితే విష్ణుసహస్రనామాలు, లలితా సహస్రనామాలు ఎందుకు అంటే భగవంతుడితో మనకు మానసిక అనుబంధం ఏర్పడటానికి ఏర్పాటుచేసారు. నిన్ను నువ్వు పొగుడుకోవటం అలవాటు అయితే, నీకు లోపల గర్వం ఇసుమంత ఉన్నా, వ్యక్తి భావన ఇసుమంత ఉన్నా ఆత్మసాక్షాత్కారం పొందాలనే ఆ తపన, పట్టుదల నీకు లోపల నుండి రాదు. జ్ఞానం అనేది పైనుండి పోసేది కాదు అది లోపలనుండి ఊరాలి.

మనకు దేహభావన ఉంది. మనందరం మన దేహంతోటి, మన పేరుతోటి తాదాత్మ్యం పొందుతున్నాము. మనం ఎంతసేపు ఈ శవంతోటి, శవానికి ఉన్న పేరుతోటి తాదాత్మ్యం పొందుతూ, వాటిచుట్టూ తిరుగుతూ ఉంటే ఇంక మనకు ఆత్మజ్ఞానం ఏమిటి? మనకు లోచూపు రాకపోవటానికి ఇవి రెండూ కారణాలు. మనకు రూపబుద్ధి, నామబుద్ధి పోలేదు. మీరు నిరంతరం నామ రూపముల చుట్టూ తిరుగుతూ ఉంటే మీరు ఎన్ని శాస్త్రములు

చదివినా, ఎంతమంది దేవతలను పూజించినా, ఎంతమంది పెద్దలను దర్శించినా మీకు సత్యసాక్షాత్కారం కలుగదు. ఇది ఏవో కబుర్లు చెప్పటం వలన పరిష్కారం అయ్యే సమస్యకాదు. సత్యం నీ హృదయంలో ఉంది. ఆ ఉన్న వస్తువును ఉన్నట్లుగా నీవు దర్శించాలి. సత్యానుభవం నీకు కలుగకపోతే ఈ జీవితంలో ఇంక నీకు స్వేచ్ఛ లేదు, శాంతిలేదు, దుఃఖంలో నుండి నువ్వు బయటకు రాలేవు. ఇప్పుడు నీకు దేహంతోటి, మనస్సుతోటి ఎంత తాదాత్మ్యం ఉందో నీ హృదయంలో ఉన్న సత్యంతో అంత తాదాత్మ్యం వస్తేగాని నువ్వు అజ్ఞానంలోనుండి, అవిద్యలో నుండి విడుదలపొందే అవకాశం లేదు. మీరు చేసే పూజల వలన దేవుడు మోసపోడు. మనుషులను మనం మోసం చేయవచ్చు. మీ ఊరు ఎవరైనా మంత్రిగారు వస్తే ఆయన మీద పంచరత్నాలు వ్రాసి ఏమైనా పనులు చేయించుకోవచ్చు. జీవలక్షణాలు ఉన్నప్పుడు పొగడ్తలు ఉపయోగపడతాయి. జీవలక్షణాలను ఓవర్‌కమ్ చేయకుండా మనకు జ్ఞానం కలిగే అవకాశం లేదు. నీకు జ్ఞానసంపద రావాలంటే గుణసంపద ఉండాలి. గుణసంపద లేకుండా జ్ఞానసంపద రాదు. మీరు ఎక్కడా అనురాగం పెట్టుకోవద్దు, అసహ్యం పెట్టుకోవద్దు, మీకు ఇష్టం లేకపోతే అలా న్యూట్రల్‌గా ఉండండి అంతేగాని అసహ్యం పెట్టుకోవద్దు. ఒక మనిషి మీద అసహ్యం పెట్టుకొంటే, వాడిపట్ల నెమ్మదిగా ద్వేషం వస్తుంది. రాగం ఉన్నా, ద్వేషం ఉన్నా మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోయి అవే మీ పతనానికి కారణం అవుతాయి.

రామకృష్ణపరమహంసగారికి వైరాగ్యం ఉంది. మనకు అప్పుడప్పుడు వైరాగ్యం వస్తుంది. ఇంట్లో పేచీలు వచ్చినప్పుడు, వ్యాపారంలో నష్టాలు వచ్చినప్పుడు మనకు విరక్తి వస్తుంది. విరక్తిలో నుండి వైరాగ్యం వస్తుంది. అది నిలబడదు. రామకృష్ణుడి వైరాగ్యం పెర్మనెంట్‌గా ఉంటుంది ఎందుచేతనంటే ఏవో బయటకారణాల వలన వారికి వైరాగ్యం రాలేదు. వారికి ఉన్న ప్రజ్ఞవలన, వారికి ఉన్న వివేకంలోనుండి వైరాగ్యం వచ్చింది కాబట్టి అది నిలబడుతుంది. ఒక కారణం వలన వైరాగ్యం వస్తే ఆ కారణం పోయాక వైరాగ్యం కూడా పోతుంది. వివేకం వలన, లోపల ఉన్న వస్తువు చేతికి దొరకటం వలన, దానిని ప్రత్యక్షంగా దర్శించటంవలన లోకంలో ఉన్న ఏ వస్తువు వాడికి నిజంగా కనబడదు. మనలాగే వాడూ లోకంలో ఉన్న వస్తువులను చూస్తూ ఉంటాడు కాని వాడికి ఆ వస్తువు మీద ఆకర్షణ కలుగదు ఎందుచేతనంటే అవి నిజంకాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. అందుచేత వాడి వైరాగ్యం పెర్మనెంట్‌గా ఉంటుంది. వాడి వైరాగ్యం వలన జ్ఞానం కలుగుతుంది కాని మన వైరాగ్యం వలన జ్ఞానం కలుగదు. మన వైరాగ్యం తాత్కాలికంగా ఉంటుంది ఎందుచేతనంటే అది వివేకంలోనుండి రాలేదు, ఏవో లోకకారణాల వలన వచ్చింది కాబట్టి అది నిలబడదు. శాస్త్రంలో వైరాగ్యం లేకుండా జ్ఞానం కలుగదు అని చెపితే భగవాన్ ఏమన్నారు అంటే అసలు వైరాగ్యానికి, జ్ఞానానికి తేడా లేదని

చెప్పారు. ఒక మనిషికి నిజంగా వైరాగ్యం ఉంటే వాడు జ్ఞానే అని చెప్పారు.

శరణాగతి అయినవాడికి ప్రశ్నలు వేసేవాడు కాని, ఆలోచించేవాడుకాని అక్కడ ఎవడూ ఉండడు. రామాయణంలో లక్ష్మణుడు రాముడికి చేసిన శరణాగతి మనందరకు ఆదర్శం. ఎప్పుడూ పెద్దరికం రాముడికి ఇచ్చాడు కాని ఆయన పెద్దరికం తీసుకోలేదు. ఇప్పుడు మనందరికి పెద్దరికం కావాలి ఇంక మనకు శరణాగతి ఏమిటి? పంచవటిలో ఉండగా రాముడు లక్ష్మణుడితో ఈ కొండమీద ఎక్కడ బాగుంటే అక్కడ కుటీరం నిర్మించు అని చెపుతాడు. అప్పుడు లక్ష్మణుడు ఏమన్నాడు అంటే నన్ను అప్పుడే పెద్దవాడిని చెయ్యకండి, మీరు ఫలానా చోటున కుటీరం నిర్మించమని చెపితే అక్కడ కుటీరం నిర్మిస్తాను అంటాడు. అదీ శరణాగతి, కంప్లీటెస్ట్ సరెండర్ టు ది విల్ ఆఫ్ శ్రీరామ. మీ శరణాగతి నిజం అయితే అసలు మీకు అశాంతే రాదు. ఓ భగవంతుడా! నీ సంకల్పమే నా సంకల్పం, నీ ఇష్టమే నా ఇష్టం అని మన మనస్సును ఆయనకు శరణాగతి చెయ్యాలి. ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి వీలు లేదు. రమణ మహర్షిగారు వారి అమ్మకు చెప్పిన మొదటి సందేశం ఏమిటి అంటే అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది. జరుగవలసినది జరిగేతీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఊరక ఉండటం ఉత్తమం అని చెప్పారు. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఈశ్వర సంకల్పమే జరుగుతుంది, అది నిశ్చయం. అయితే నువ్వు దేహంతో తాదాత్మ్యం వదిలెయ్యాలి. నువ్వు దేహంతో తాదాత్మ్యం పెట్టుకొంటావా, వదిలేస్తావా అక్కడే ఉంది నీ సాధనాబలం అంతా. మీరు దేహంతో తాదాత్మ్యం పొందరు అనుకోండి మీకు ఐశ్వర్యం వచ్చి నెత్తిమీద పడినా ఏమీ అనిపించదు, అసలు గర్వం రాదు. ఏదో వచ్చేసింది అనుకోరు. ఒకవేళ మీకు ఉన్నదంతా పోయినా ఏదో పోతోంది అనుకోరు. వచ్చేదీ, పోయేదీ ఏదీ నిజంకాదు. శరణాగతి చేయటంవలన నీ జీవితం సుఖంగా వెళ్ళిపోతుంది, మీ మనస్సుకు శాంతి కలుగుతుంది, మీరు నిర్మలంగా ఉంటారు. జ్ఞానం రావటానికి మనం ఎంతో కష్టపడాలి. అనేక జన్మలు సాధన చేస్తేగాని, పుణ్యకర్మలు చేస్తేగాని, సత్కర్మలు చేస్తేగాని నీకు జ్ఞానం కలుగదు అని పరమాత్మ చెప్పాడు. ఇక్కడ రమణమహర్షిగారు ఏమంటున్నారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా! సాధన పేరుమీద నన్ను బాధలకు గురిచేయకుండా, నన్ను ఏమీ నొప్పించకుండా నన్ను నువ్వు తీసుకొని, నిన్ను నాకు ఇచ్చేసావు అన్నారు భగవాన్. ఈశ్వరుని అనుగ్రహం లేకుండా మనం ఏమీ సాధించలేము. ఆయన అనుగ్రహం ఉంటే అన్నీ సాధ్యమే.

నువ్వు అనుకొన్నదే భగవంతుడు కూడా అనుకొంటే ఆ పని నెరవేరుతుంది. భగవంతుడు అనుకోవటం వలన ఆ పని నెరవేరింది అని మీరు అనుకోరు. మేమే

సాధించాము అనుకొంటారు. సాధించటానికి మీ వలన ఏమి అవుతుంది. దేవుడి సంకల్పం వలన ఆ పని అయ్యింది అనే బుద్ధి మనకు రావటంలేదు. మనం ఒకటి అనుకొని, దేవుడు వేరొకటి అనుకొంటాడు అనుకోండి అప్పడు కూడా దేవుడు అనుకొన్నదే జరుగుతుంది. అప్పడు మనం ఏమనుకొంటున్నాము అంటే దేవుడు మాకు అన్యాయం చేసాడు అనుకొంటాము. దేవుడు మనకు విరోధికాదు. ఎప్పడు అయినా మనకు ఏదైనా పనిష్మెంట్ ఇచ్చినా మనలను రాంగ్‌పాత్‌లో నుండి రైట్‌పాత్‌లోనికి తీసుకొనిరావటానికే అది అంతా చేస్తాడు. దేవుడు అలా చేసాడు, ఇలా చేసాడు అని మనం దేవుడిని తిట్టకూడదు. ఎందుచేతనంటే ఆయన ఎందుకు అలా చేస్తున్నాడో మనకు తెలియదు. దేవుడు ఎందుకు అలా చేస్తున్నాడో ఆయనకే తెలుస్తుంది కాని ఇతరులకు తెలియదు. అందుచేత అలా చేసాడు, ఇలా చేసాడు అని దేవుని తిట్టకూడదు, అది చాలా తప్ప. ఒకో కుటుంబానికి ఏదైనా చెడ్డ జరుగవచ్చు. ఆ చెడ్డ ఎందుకు జరిగిందో, దాని ద్వారా మీకు మంచి తీసుకొనిరావటం భగవంతుడి ప్లానింగ్‌లో ఉండవచ్చు. అప్పటిదాకా మనం ఓపిక పట్టాలికాని దేవుని తిట్టకూడదు. మీ వ్యక్తిగత జీవితంలోగాని, మీ కుటుంబానికి కాని ఏదైనా చెడ్డ జరిగితే కంగారుపడవద్దు. ఏదో టైములో దానికి రెట్టింపు మంచి మీకు వచ్చేస్తుంది, ఈ లోపుగా మీరు వర్రీపడవద్దు.

చావు పుట్టుకలు కేవలం దేహానికి సంబంధించినవి. దేహం చనిపోతే పునర్జన్మలు ఆగవు. అజ్ఞానం నశిస్తే, అవిద్య నశిస్తే పునర్జన్మలు ఆగుతాయి. నీలో ఉన్న మాయ నశిస్తే అప్పడు పునర్జన్మలేని స్థితికి ఎదిగివెళతావుకాని నీలోపల అజ్ఞానం అలాగే ఉండి, మాయ అలాగే ఉంటే ఈలోపుగా నీ శరీరానికి చావు వస్తే నీకేమీ రాదు, పునర్జన్మలు ఆగవు. తిరవళ్ళువర్ ఏమనిచెప్పాడు అంటే చావు వస్తే మీరు కంగారుపడకండి, భయపడకండి, చనిపోవటం అంటే నిద్రపోవటం అని చెప్పాడు. చనిపోవటానికి నిద్రపోవటానికి తేడా ఏమిటి అంటే రాత్రి నిద్రపోయినవాడు మరల ఉదయం అదే శరీరంలో లెగుస్తాడు కాని చనిపోయిన వాడు ఇంకో దేహంలో లెగుస్తాడు అంటే పునర్జన్మ ఇంకో దేహంలో వస్తుంది. జాగ్రదవస్థలో మీరు సాధన చేసుకోవాలి కాని నిద్రలో మీరు చేసేది ఏమీ లేదు. అలాగే శరీరం చనిపోయిన తరువాత పునర్జన్మ వచ్చేలోపు మీకు సాధన ఏమీ ఉండదు అందుచేత మీరు జీవించి ఉ ండగానే అంటే ఈ శరీరానికి చావురాకముందే కాలాన్ని సద్వినియోగం చేసుకొని, మిమ్మల్ని మీరు సంస్కరించుకొని, దైవాభిముఖంగా ప్రయాణం చేసి బ్రాహ్మీస్థితిని పొందాలి కాని చనిపోయిన తరువాత మీరు చేసేది ఏమీ లేదు అని తిరువళ్ళువర్ చెపుతున్నాడు. అందుచేత చనిపోయిన తరువాత ఏదో సాధిస్తాం అని అనుకోవద్దు, బతికి ఉండగానే ఆ సాధించేది ఏదో సాధించండి అని చెప్పటం.

దేహగతమైన నేనుని వీడు ఎవడు అని విచారణ చెయ్యండి లేకపోతే మన మనస్సుకి, బుద్ధికి, ఈ ప్రకృతికి అతీతమైన ఒక హయ్యర్ పవర్ ఉంది, దానికి శరణాగతి అయినా చెయ్యండి. మీకు ఏ మార్గంలో అయినా దేహబుద్ధి పోతుంది. మీరు జ్ఞానమార్గంలో వెళ్ళినా, భక్తిమార్గంలో వెళ్ళినా హృదయంలో ఉన్న సత్యంలో ఐక్యమవ్వాలి. జ్ఞానమార్గం కోతి, భక్తి మార్గం పిల్లి అంటారు. ఈ ఉదాహరణ ఎందుకు వచ్చింది అంటే పిల్లి ఒకచోట నుండి ఇంకో చోటుకు వెళ్ళినప్పుడు పిల్లను నోట్లో పెట్టుకొని జాగ్రత్తగా తీసుకొనిపోతుంది. ఇక్కడ పిల్ల అజాగ్రత్తగా ఉన్నా ఫరవాలేదు. అది భక్తి మార్గం. జ్ఞానమార్గానికి కోతి లక్షణాలు ఉన్నాయి. కోతి ఒక చెట్టుమీద నుండి ఇంకో చెట్టుమీదకు ఉరుకుతూ ఉంటుంది. కోతిపిల్ల తల్లి పొట్టని అంటిపెట్టుకొని ఉంటుంది. ఇక్కడ కోతిపిల్ల అజాగ్రత్తగా ఉంటే కిందపడిపోతుంది అందువలన పిల్ల చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. ఒకవేళ కిందపడిపోతే అది తల్లిని సరిగా పట్టుకోలేదని అర్థం. అక్కడ తల్లి తప్పు ఏమీ లేదు. జ్ఞానమార్గంలో ప్రయాణం చేసేవాడు బహుజాగ్రత్తగా ఉండాలి. ఈ కలియుగంలో జ్ఞానమార్గం కంటే, భక్తిమార్గం మంచిది అని పెద్దలు చెపుతారు. మీలో ఎవడైనా ఎక్కువ డబ్బు సంపాదించాడు అనుకోండి, వాడి బుద్ధిలో ఏదో చెడ్డతనం లేకుండా, వాడిలో పాపపుదుంప లేకుండా ఒక్కసారిగా ఎవడు ధనవంతుడు అవ్వలేడు. లేకపోతే ఒక్కసారిగా అంత డబ్బు నీకు ఎలా వచ్చింది. మీలో పాపపుదుంపలు ఉన్నాయి. ఆ పాపపు దుంపలు మీలో ఉన్నంతకాలం డబ్బును పోగుచేయాలి, పోగుచేయాలి అని మీకు అనిపిస్తుంది. చివరకు మీరు అలా డబ్బు సంపాదించాక వెనకాల వారు పతనమవ్వటానికి ఆ డబ్బే కారణం అవుతుంది. నువ్వు భగవంతుడికి శరణాగతి చెందితే నీకు సంకల్పం అంటూ ఏమీ ఉండకూడదు. అంటే నా జీవితం అలా ఉండాలి, ఇలా ఉండాలి అని నువ్వు అనుకోకూడదు. ఈశ్వరుడి చేతిలో పనిముట్టుకింద ఉండాలి. మీకు రియలైజేషన్ ఇచ్చేముందు దేవుడు కొన్ని కఠినమైన పరీక్షలు పెడతాడు. వాటిని తట్టుకోలేరు అనుకోండి మిమ్మల్ని తీసేస్తాడు అంటే పునర్జన్మలోనికి గెంటేస్తాడు. ఏమో ఆ జన్మలు ఎటువంటివి వస్తాయో మనకు తెలియదు. అందుచేత సహనం ఉండాలి, మోక్షం సంపాదించాలి అనేటువంటి స్థిరమైన బుద్ధి ఉండాలి. సాధన చేసేటప్పుడు మనకు ప్రతికూలమైన పరిస్థితులు ఎదురైనా వాటిని తట్టుకొని హెచ్చుతగ్గులు లేకుండా స్థిరంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి, నిర్మలంగా ఉండాలి.

జరిగిపోయిన గొడవలు మరచిపోండి. జరిగిపోయినదేదో జరిగిపోయింది. భవిష్యత్ కాలం గురించి గాలిలో మేడలు కట్టవద్దు. ఏదో మనం టాటా అయిపోదాము, బిర్లా అయిపోదాము అని అలా ఊహించుకోవద్దు. ఏదో అన్న వస్త్రాలకు లోటులేకుండా వెళ్ళిపోతే సరిపోతుంది. ఎప్పుడూ వర్తమాన కాలంలో జీవించండి. ఇప్పుడు మీ దేహం ఏ పని అయితే

చేస్తోందో నూటికి నూరుపాళ్ళు మీ మనస్సు అక్కడ ఉండాలి. అలా ఉంటే నీకు ఆ పని సిద్ధిస్తుంది. పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ఒక్కోమార్గం మీద ఒకరికి ఇష్టం కలుగుతుంది. నీకు ఏ మార్గం ఇష్టమైతే అది భక్తిగా చెయ్యి, శ్రద్ధగా చెయ్యి, హృదయపూర్వకంగా చెయ్యి. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఫరవాలేదు అందులో నువ్వు ఐక్యమవ్వాలి. చేసేపని సిన్సియర్‌గా చెయ్యాలి, గమ్యాన్ని మర్చిపోవద్దు. నువ్వు భగవంతుడితోటి ఏమనిచెపుతావు అంటే నీకు సంకల్పాలు ఉన్నాయి, నాకూ సంకల్పాలు ఉన్నాయి. నీకు ఇష్టాలు ఉన్నాయి, నాకూ ఇష్టాలు ఉన్నాయి. నాకూ సంకల్పాలు ఉన్నా నా సంకల్పం నెరవేరాలనుకోవటం లేదు నీ సంకల్పం నెరవేరుగాక. నాకు ఇష్టాలు ఉన్నా నా ఇష్టాలు నెరవేరాలనుకోవటంలేదు నీ ఇష్టాలే నెరవేరుగాక అని నోటితో అనటంకాదు హృదయ పూర్వకంగా చెప్పాలి. అదీ భక్తి మార్గం. అలా శరణాగతి చేయటం వలన ఆ శరణాగతికి ఒక నిండుతనం వస్తుంది. అప్పుడు ఈశ్వరుని దయ వలన నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. ఇక రమణమహర్షిగారి శరణాగతి ఎటువంటిది అంటే అది మనం ఊహించలేము.

భగవాన్ అరుణాచలం వచ్చినప్పుడు కొంతకాలం ఒక తోటలో ఉండేవారు. ఆయన సర్వసాధారణంగా కళ్ళుమూసుకొని ఉండటం అలవాటు. ఆయన గురించి ఒక పాట ఉంది. కళ్ళు మూసుకొంటే తనని తాను చూసుకొంటాడు, కళ్ళు తెరిస్తే ఆయనలో ఉన్నది మనకు చూపిస్తాడు. ఆ కళ్ళు భౌతికమైన నేత్రాలుకాదు, అవి జ్ఞాననేత్రాలు. అంటే సత్యం ఆ కళ్ళలో మనకి దర్శనం ఇస్తూ ఉంటుంది. పాటీ అనే భక్తురాలికి చివరి రోజులలో కళ్ళు పోయినాయి. ఆవిడ రోజూ భగవాన్‌ను చూడటానికి వచ్చేది. ఏ పాటీ నీకు కళ్ళు కనబడవు. కళ్ళు కనబడనప్పుడు రోజూ నన్ను చూడటానికి ఎందుకు వస్తున్నావు అన్నారు భగవాన్. నాకు కళ్ళు కనిపించవు అన్న సంగతి నాకు తెలుసు. నా కళ్ళు నిన్ను చూస్తాయని నేను రావటం లేదు, నీ కళ్ళు నన్ను చూస్తాయని వస్తున్నాను అని చెప్పింది. అంటే భగవాన్ చూడటం ముఖ్యం. మేము మంచివారము, మేము మంచివారము అని చాలామంది అనుకొంటున్నారు కదా. మేము మంచివారము అని మీరు అనుకొంటే భగవంతుడు మీకు జ్ఞానం ఇవ్వడు. మీరు మంచివారు అని ఆయన అనుకోవాలి.

బుద్ధుడు అయినా, భగవాన్ అయినా, ఏ జ్ఞాని అయినా వాళ్ళ టీచింగ్ అంతా మిమ్మల్ని దుఃఖస్పర్శలేని స్థితికి తీసుకొనిపోవటానికే చెపుతారు. అంతేగాని ఎప్పుడో చనిపోయిన తరువాత ఏదో లోకానికి వెళ్ళటంకాదు. మీ శరీరాలు ఈ భూమి మీద తిరుగాడుతున్నప్పుడే దుఃఖస్పర్శ ఎలా ఉంటుందో, అశాంతి యొక్క స్పర్శ ఎలా ఉంటుందో తెలియనిస్థితికి, ఎక్కడైతే భయంలేదో, ఎక్కడైతే రాగద్వేషములు లేవో ఆ స్థితికి మిమ్మల్ని మోసుకొనిపోవటానికే జ్ఞాని

చేసే ప్రయత్నం. జ్ఞాని బోధించి ఊరుకోడు, ఇవ్వటం కూడా ప్రారంభిస్తాడు. అక్కడ తిరిగి ఆశించటం ఏమీ ఉండదు ఎందుచేతనంటే తనకంటే భిన్నంగా ఏదీ లేదు. మీకు ఉన్న డబ్బు వలన, చదువు వలన మీ దుఃఖం పోదు. డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువులు కొనుక్కోవచ్చు, శరీరానికి సంబంధించిన భోగాలు అనుభవించవచ్చు అంతేగాని మీ డబ్బు సత్యానుభవం పొందటానికి ఏమీ ఉపయోగపడదు. మీ డబ్బు దేహానికి కంఫర్టు తీసుకొని వస్తుంది కాని మనస్సుకు కంట్రోలు తీసుకొని రాలేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-11-2010, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం రాళ్లకు ఇచ్చే విలువ మనుషులకు ఇవ్వటంలేదు. రాతిమనుషులకు రాతి దేవుళ్లే ఉండాలి అన్నారు భగవాన్. కొంతమంది మనసులు రాతిలా ఉంటాయి, వారికి రాతి దేవుళ్లే పనికి వస్తారు కాని మామూలు మనుషులు పనికిరారు. మన దేశంలో భక్తులకు కూడా రాతి దేవుళ్ళు అంటేనే ఎక్కువ ఇష్టం. దేవుడిని పొగడటం, దేవుడికి స్తోత్రాలు చేయటం నేర్చుకొన్నాము కాని ఒక మనిషికి ఉపయోగపడటం నేర్చుకోలేదు. ఆ అలవాటు మనకు లేదు. నేను జపం చేసుకొంటున్నాను, ఆ జపం ఎంతకాలం చెయ్యాలి, ఏ దేవుడినైతే జపం చేస్తామో ఆ దేవుడి రూపం కూడా దగ్గరగా పెట్టుకోవాలా అని అడుగుతున్నారు. రూపం కంటే నామం గొప్పది. మీకు నామం మీద మనస్సు నిలబడుతూ ఉంటే రూపం అక్కరలేదు. కాని నామం మీద మీ మనస్సు నిలబడకపోతే అప్పుడు రూపాన్ని సపోర్టుగా పెట్టుకోండి, అందులో ఆక్షేపణ లేదు. అయితే జపం ఎంతవరకు చెయ్యాలి అంటే అది సహజం అయ్యేవరకూ చెయ్యాలి. ఇప్పుడు మనం ముక్కుతో గాలి తీసుకొంటున్నాము. అక్కడ మన ప్రయత్నం ఏమీ లేదు. గాలి తనంతట తాను లోపలకు వెళుతోంది, బయటకు వస్తోంది, అంటే సహజంగా జరుగుతోంది. అలాగే మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా లోపల జపం నేచురల్‌గా, నార్మల్‌గా జరిగిపోతూ ఉండాలి. మీకు రాత్రి మెలుకువ వచ్చింది అనుకోండి, అప్పుడు మీకు ఏదీ జ్ఞాపకం రాకూడదు, మీరు చేస్తున్న నామమే మీకు జ్ఞాపకం రావాలి. ఇది కాకుండా ఇంకోటి జ్ఞాపకం వస్తే మీకు జపం సరిగ్గా సాగటంలేదు అని అర్థం.

మీ మనస్సును ముక్కు దగ్గర పెట్టుకొని లోపలకు వెళ్లేగాలి, బయటకు వచ్చేగాలి చూసుకోండి. అప్పుడు మనస్సుకు కొంచెం శాంతి కలుగుతుంది. మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, మీకు రక్తపోటు ఉంటే తగ్గిపోతుంది. అశాంతి వలన రక్తపోటు పెరిగిపోతుంది. మీరు శాంత చిత్తము కలిగి ఉండాలి. అనుకూలమైన భార్య దొరకటం కంటే, నచ్చిన ఉద్యోగం దొరకటం కంటే శాంతచిత్తము కలవాడు అదృష్టవంతుడు అని రాధాకృష్ణన్‌గారు చెప్పారు. శాంతచిత్తము